

# టేకిట్ ఈజీ!! - 2

## శ్రీనివాస ఫణికుమార్ డొక్కా



# కంప్లీట్ చెకప్

**విసురుగా తలుపు తోసుకుని** డాక్టర్ రూంలోకి ఎంటరయ్యాను. చదువుతున్న ఫైల్లోంచి కళ్ళు పైకి పెట్టి, ఓ మాటు నిర్లిప్తంగా చూసి, మళ్ళీ ఫైల్ చదువుకోవడం మొదలెట్టాడు డాక్టర్.

ఎదురుగా ఉన్న రివాల్వింగ్ చెయిర్ మీద చెయ్యేసి, సూటిగా డాక్టర్ డిప్ప కేసి చూస్తూ అడిగాను, **"నిజం చెప్పండి డాక్టర్, నాకేమయింది..".**

**అతను** బుర్ర పైకెత్తి, కళ్ళజోడు సద్దుకుంటూ నన్నో మాటు చూసి, ముక్కు గోక్కుని, మళ్ళీ ఫైల్లో తలపెట్టాడు. ఓ నిమిషం నిశ్శబ్దం. తరవాత రివాల్వింగ్ ఛెయిర్‌ని బలంగా తిప్పాను. అది ఓ ఎనిమిది చుట్లు తిరిగి ఆగింది. అప్పుడు మళ్ళీ ఇంకాస్త బలంగా అడిగాను.

**"ఛెప్పండి డాక్టర్, నాఖేమయింది?".**

ఇంక లాభం లేదనుకుని డాక్టర్ తలపైకెత్తి **"ముందు నువ్వా కుర్చీతో ఆడుకోవడం ఆపి, దాన్లో కూర్చుంటే అప్పుడు చెబుతాను."** అన్నాడు చిరాగ్గా మొహం పెట్టి.

**"ఓహ్..అయ్యాం స్సారీ డాఖ్టర్.."** అంటూ కుర్చీలో కూలబడ్డాను. కుడి చెయ్యి పిడికిలి బిగించి గడ్డం కిందపెట్టుకుని, ఎడం పిడికిలి డొక్కలో బోటెట్టుకుని అడిగాను "ఫరవాలేదు డాక్టర్, అయాం రెడీ ధైర్యంగా చెప్పండి".

అతను ఓ మాటు తలపైకెత్తి **"తప్పదా"** అన్నాడు విసుగ్గా.

**"తప్పదు డాఖ్టర్, మీ ప్రాక్టీస్ లో కొన్ని పదుల, ఐమీన్ వందల పేషేంట్లని చూసుంటారు, ఖానీ నాలాంటి గుండె నిబ్బరంగల వాణ్ణి ఎక్కడా ఎహెాఖ్ఖడా చూసి ఉండరు. నిర్భయంగా చెప్పండి".** కాస్త గేప్ ఇచ్చాను నేను.

**"మీరిప్పుడు గర్భవతి. మరో నాలుగు నెలల్లో పండంటి బిడ్డని కనబోతున్నారు."**

**"వ్వాట్.."** అంటూ కుర్చీలోంచి గెంతి అతని చేతిలో ఫైలు లాక్కున్నాను.

దానిమీద **"రిపోర్ట్ ఆఫ్ మంగతాయారు మంగతాయరు, 22"** అని ఉంది.

**"ఇది నా ఫైలు కాదు.."** అన్నాను బుంగమూతి పెట్టి.

అప్పుడు డాక్టర్ నాకేసి చూసి **"నాకు తెలుసు, ఇందాకణ్ణించి, చెప్పండి డాక్టర్, చెప్పండి డాక్టర్ అని ప్రాణం తీసేస్తున్నావు, అందుకే చెప్పాను. హాస్పటల్లో కొచ్చి ఏ రూంలో పడితే ఆ రూముకి వెళ్ళకూడదు. నీ ఫేసు చూస్తే కంప్లీట్ చెకప్‌కి వచ్చినట్టున్నావు, పక్క వార్డులో ధర్మరాజుంటారు ఆయన్ని కలు, వెళ్ళు.."** అని మళ్ళీ మంగతాయారు, 22 ఫైలు తీసుకుని, దాని మధ్యలో ఉన్న స్వాతి వారపత్రిక చదువుకోవడం మొదలుపెట్టాడు డాక్టర్. ఆ ధర్మరాజుగారి ఇంటిపేరు ఎం అవునో కాదో అడుగుదామనుకున్నాను గానీ, ఓపిక లేక, కాళ్ళీడ్చుకుంటూ బైటికొచ్చి, మళ్ళీ విసురుగా పక్కరూంలోకి ఎంటరయ్యాను.

**"డాక్టర్.."**

**"ఆ, రావోయ్ గుర్నాథం, నీ బిల్లు మొత్తం పదివేలయిందోయ్.."**

**"డాక్టర్, నా పేరు గుర్నాథం కాదు, చక్రవర్తి.."**

**"అబ్బో చక్రవర్తే. సరే అయితే, రావోయ్ చక్రవర్తీ, నీ బిల్లు లక్ష అయింది అన్నీ కలిపి.."**

**"అబ్జీ బాబోయ్, నేనండి మీ గుర్నాథాన్నే. పదివేలే బెటరు. వెధవది ఏ పేరే అయింతేనేం. అయినా, అన్నీ కలిపి అంటున్నారు, కొంపతీసి పక్క రుంలో మంగతాయారు ప్రెగ్నెన్సీ బిల్లు కూడా కపిపేసారా?"** అన్నాను దీనంగా మొహం పెట్టి.

**"హమ్మా, ఆశ, చి..లి..పి"** అంటూ కుర్చీలోంచి లేచొచ్చి, వేలు పెట్టి బొడ్డులో ఒక్కపోటు పొడిచాడు. ఆ పోటుకి నేను, టిప్పు సుల్తాను తప్ప ఇతరులు తట్టుకోవడం అసాధ్యం. అవసరం నాది కాబట్టి పాకుతూ కుర్చీలోకి జేరాను. ఇక **"చెప్పండి డాక్టర్"** అనే ఓపిక లేక, ఎలాగూ ఆయన చెబుతాడని వెయిట్ చేస్తున్నాను.

ఆయన ఫైలంతా చదువుతూ **"వెరీ గుడ్, వెరీ గుడ్ వెరీ వెరీ గుడ్, వండర్ ఫుల్.."** అంటున్నాడు వెట్టి గుడ్లేసుకుని.. ప్రతీ మాటకీ గుడ్లు మరింత పెద్దవౌతున్నయి. నాకు ఉత్సాహం ఆగలేదు.

**"నిజంగానే ఆరోనెలా డాక్టర్..?"** అడిగాను ఆశగా.

**"నీ వెర్రిమండా. మగాళ్ళకి పిల్లలు పుట్టరు. నీ బొజ్జ "ఆ" బొజ్జకాదు. కాస్త నేను చెప్పేది విని తగలడు.."**

నేను నోరుమూసుకున్నాను. ఆయన మొదలెట్టాడు. **"ఈ రిపోర్టుని బట్టి చూస్తే నీకు ఈ మధ్యనే పెళ్ళయ్యుండాలి.."** అన్నాడు.

**"ఖరెక్ట్ డాక్టర్, ఆరు నెలల క్రితం అయింది, పెళ్ళికి మా ఆవిడ కూడా వచ్చింది.."** అన్నాను ఆసక్తిగా.

డాక్టర్ స్టెతస్కోపు తిరగ్వేసి ఛెళ్ళుమని ఒక్కటిచ్చాడు నా నడ్డిమీద. **"దరిద్రుడా, నీ పెళ్ళికి వచ్చి, తాళి కట్టించుకుంది కాబట్టే ఆవిడ మీ ఆవిడ అయింది, ఇంకోసారి మాట్లాడితే ఆ పట్టున పీకి పిసికేస్తాను, చెప్పేది విని తగలడు..".**

చేసేదిలేక మళ్ళీ నోరు మూసుకున్నాను.

**"ఆరునెలల క్రితం రిపోర్టులో నీ బ్లడ్ గ్రూపు వై నెగిటివ్. అంటే ప్రతీదీ "వై", అని ప్రశ్నించే టైపన్నమాట. ఇప్పుడది "ఓకే పాజిటివ్" అయిపోయింది. అంటే ఎవరేమన్నా ఓకే అనే టైపు, ముఖ్యంగా నీ పెళ్ళికొచ్చిన మీ ఆవిడ కొట్టినా, కుమ్మేసినా, ఉమ్మేసినా "ఓఖే" అనేలా ట్రైన్ అయ్యావన్నమాట. వెరీ గుడ్ ఇంప్రూవ్మెంట్"** అని మళ్ళీ రిపోర్టులో ఒక్కో పేజీ తిప్పుతూ..

**"అన్నీ, అహన్నీ నార్మల్, కొలెస్ట్రాల్ జీరో, హార్ట్ రేట్ జీరో, బ్లడ్ ప్రెషర్ జీరో బై జీరో.. వెరీ గుడ్ .. నువ్వు జీడి రామ్మూర్తిలా, దుక్కముక్కలా ఉన్నావోయ్.."** అన్నాడు.

**"ఊరుకోండి సార్, మరీ చిన్నపిల్లాడ్ని చేస్తున్నారు, హార్ట్ రేట్ జీరో ఏంటిసార్, ఏ ఒకటో రెండో ఉండాలి కదా.."** అన్నాను నా వైద్య పరిజ్ఞానం వెలగబెడుతూ.

**"తెలివైన మనిషి, కనిపెట్టేసావు, అసలు పైకి ఇలా కనిపిస్తావు గానీ గుర్నాధం, నువ్వు టూమచ్చోయ్.. నిజవే, హార్ట్ రేటు రోజుకి ఒకటో రెండో ఉండాలని నేనూ పుస్తకంలో చదువుకున్నానోయ్, మరిదేవిటి జీరో అని రాసారు. ఆ అర్థవైపోయింది, వాళ్ళు నీ హార్ట్ రేటు చూస్తున్నప్పుడు స్టెతస్కోపులో కరెంటు పోయుంటుంది.."** అన్నాడు గర్వంగా. నాక్కొంచెం ఊరటగా అనిపించింది.

**"అయితే మరేం భయం లేదంటారా డాక్టర్.."** అన్నాను నేను మెత్తగా.

**"ఏవీ భయం లేదు. మళ్ళీ ఖరెంటు వచ్చేసిందిగా"** అన్నాడు డాక్టర్.

**"డాక్టర్, నేనడిగేది నా గురించి.."** అన్నాను దీనంగా.

**"అదే తొందరంటే, అంతా బానే ఉంది కానీ, అందరికీ గుండెలో నాలుగు గదులుంటాయి. నీ గుండెలో ముందు రెండు గదులే కనిపిస్తున్నాయి.."** అని కాస్త గేప్ ఇచ్చాడు.

**"అవును డాక్టర్, మాలాంటి పేదవాళ్ళకి గుండె ఆడితేనే గానీ డొక్కాడదు, అందుకే గుండెలో వెనక రెండు గదులూ, మొన్ననే ఒక అటాచ్డ్ బాత్రూం కూడా కట్టి అద్దెకిచ్చాను డాక్టర్"** అన్నాను.

**"అల్లా చెప్పు, ఇంక వెళ్ళి ఆ పదివేలూ కట్టేస్తే మాకు మరేం భయం ఉండదు.."** అన్నాడు తాపీగా.

**"కడతాను డాక్టర్. ఇంక నేను వెళ్ళచ్చా.." అంటూ లేచాను కుర్చీలోంచి.**

**"ఇంకొక్క డాక్టర్ని కలు, పక్క రూంలో ఫుడ్ స్పెషలిస్టు ఉన్నాడు. ఆయన నీకు చల్లని కబుర్లు చెబుతాడు, అవి విని ఫీసు కట్టేసి వెళ్ళు.."** అని తనలో తను అంతాక్షరి ఆడుకోడం మొదలెట్టాడు ఆ హార్టు స్పెషలిస్టు.

నేను పక్క రూం తలుపు తెరిచాను. ఆ విశాలమైన రూంలో నలుగురే నర్సులున్నారు. వాళ్ళు చాలా విశాలంగా ఉన్నారు. వాళ్ళ చేతిలో ప్లేట్లు ఇంకా విశాలంగా ఉన్నాయి. ఆ ప్లేట్లో ఫుడ్ ఎక్కవుందో, వాళ్ళ నోట్లో ఎక్కవుందో చెప్పడం కష్టం. వాళ్ళు నలుగురూ ఫుడ్ స్పెషలిస్టులే అనిపించింది. వాళ్ళు నాకేసి చూసి **"చీ, ఏంటా సిలిపి సూపు, ఇది కేంటీను, నీ డాక్టర్ అటుపక్క గదిలో ఉంటాడు ఫో"** అని సిగ్గు పడుతూ తినడం కంటిన్యూ చేసారు. నేను కాళ్ళీడ్చుకుంటూ ఫుడ్ గాడిధగ్గిరికెళ్ళాను. ఆయన నన్ను సాదరంగా ఆహ్వానించాడు. **"చక్రవర్తిగారూ, మీరు మీ ఫుడ్ హేబిట్లు మార్చుకోవాలండీ.."** అంటూ మొదలెట్టాడు.

**"పొద్దున్నే కాఫీ కప్పులో కనీసం అరకప్పు పంచదార వేసుకోవాలి. టూ హండ్రెడ్ పర్సెంటు మిల్కనీ, దొరుకుతుంది, అది పోసుకుని కాఫీ చేసుకోండి, తవ్విడి గ్లాసులో తాగాలి కాఫీ, సరేనా. తరవాత ఓ పన్నెండు గారెలు, ప్లేటు పొంగలో, లేదా నాలుగు వాయల ఇడ్లీలో తినాలి, కనీసం రెండు మూడు రాచ్చిప్పల పచ్చళ్ళేసుకోవాలి. మళ్ళీ మధ్యాహ్నం పన్నెండు లోపలే లంచి చెయ్యాలి. బంగాళ దుంపతో మూడు రకాల వేపుళ్ళు లేకపోతే, ఇహ ఆవేళ భోజనానికి కూర్చోకండి. ఇది ఒక నియమంగా పెట్టుకోండి. కనీసం రెండు అపటైజర్లు, మూడు డీప్ ఫ్రైలు, నాలుగు పన్నీరు కూరలు, రెండు స్వీట్ల పేకెట్లూ ఉండేట్టు చూసుకోండి. అసలు పళ్ళు, ఆకు కూరలు ఇలాంటి దిక్కుమాలిన తిళ్ళు తినకండి, హెల్త్ దెబ్బ తింటుంది.**

**అనవసరంగా నడవకండి. కారు ఎక్కేప్పుడూ దిగేప్పుడూ నడుస్తారు చూడండి, ఆ నాలుగు అడుగులూ అసలు ఎక్కీ తొక్కీను. వారం రోజులకోసారి సోఫాలోంచి లేచి, ఓ గ్లాసుడు కోకోకోలా తెచ్చుకుని తాగుతు ఉండండి. మంచినీళ్ళెక్కువ తాగకండి. రోజుకి ఆరు సార్లు భోజనం చెయ్యండి. శనివారాలు తప్పనిసరై ఫలహారం చెయ్యాల్సి వస్తే ఓ పదహారు పెద్దపూరీలు, చిన్న స్టీలు బకెట్టుతో బంగాళదుంప కూరా తినండి. ఇవన్నీ ఒక పుస్తకంలోరాసి ఇస్తాను. తూ.చ తప్పకుండా పాటించండి. ఫీజు కట్టేసి వెళ్ళి రండి.."** అని సాగనంపాడు.

నేను లక్షరూపాయల బిల్లుకి ఇంకో లక్ష టిప్పు వేసి రెండు లక్షలూ కట్టేసాను. ఆ డాక్టర్ చెప్పినదంతా నెమరు వేసుకుంటూ, **"థాంక్యూ డాక్టర్, మీ మేలు జన్మలో మర్చిపోలేను. అదేవిటి డాక్టర్, మీరు గాజులు వేసుకున్నారు, కొత్త ఫేషనా.."** అన్నాను.

మొహం మీద చల్లని ద్రవ పదార్థమేదో పడి, గబుక్కున తెలివొచ్చింది.

మా ఆవిడ. **"ఎవరా డాక్టరు, ఏమా కథ..?"** అంది చెవి మెలిపెడుతూ..

## (వచ్చే సంచిక దాకా లైట్ తీస్కోండి!)

POST YOUR COMMENTS